


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02
4PM






## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన కేఏ పాల్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏ పాల్ మర్యాదపూర్వకంగా సోమవారం ఉదయం కలిశారు. జనవరి 30వ తేదీన హైదరాబాద్‌లో జరిగే గ్లోబల్ పీస్ సదస్సుకు హాజరు కావాలని రేవంత్ రెడ్డిని పాల్ ఆహ్వానించారు. ఇందుకు కావాల్సిన అనుమతులను మంజూరు చేయాల్సిందిగా పాల్ సీఎంను కోరారు. దీనిపై సీఎం రేవంత్ సానుకూలంగా స్పందించారని పాల్ తెలిపారు. ఈ ప్రపంచ శాంతి సదస్సుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో పాటు పలువురు నాయకులను ఆహ్వానించినట్లు కేఏ పాల్ పేర్కొన్నారు. ఈ సదస్సుకు పలు దేశాల నుంచి వేల మంది హాజరవుతున్నట్లు పాల్ వెల్లడించారు.





# హమాస్ టన్నెల్స్‌లో ఐదుగురు బందీల మృతదేహాలు

## గాజా దాడిలో 78 మంది మృతి

ఇజ్రాయిల్-హమాస్ వార్ ఇప్పట్లో ఆగేలా కనిపించడం లేదు. హమాస్ ఉగ్రసంస్థను నేలమట్టం చేసేదాకా యుద్ధాన్ని ఆపేది లేదని ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ఇప్పటికే స్పష్టం చేశారు. ప్రపంచదేశాల నుంచి వస్తున్న ఒత్తిడిని సైతం లెక్క చేయకుండా హమాస్‌పై పోరుసాగిస్తున్నారు. ఇదిలా ఉంటే గాజాలోని హమాస్ కీలక టన్నెల్ వ్యవస్థను కుప్పకూల్చేందుకు ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) పనిచేస్తున్నాయి. ఇప్పటికే ఆ టన్నెల్స్‌ని సముద్ర నీరుతో ముంచేయాలని ప్లాన్ చేసింది. హమాస్ ఈ టన్నెల్స్‌ని కమాండ్ సెంటర్లుగా వాడుకుంటుందని ఇజ్రాయిల్ బలగాలు ప్రపంచం ముందు సాక్ష్యాలను చూపించాయి. గాజా నగరంలోని ప్రముఖ ఆస్పత్రుల కింద ఈ టన్నెల్ వ్యవస్థ ఉండటాన్ని కూడా ఇజ్రాయిల్ గుర్తించింది. ఈ టన్నెల్స్ లోనే ఇజ్రాయిలీ బందీలను హమాస్ ఉంది. తాజాగా ఇజ్రాయిల్ బలగాలు ఐదుగురు ఇజ్రాయిలీ బందీల మృతదేహాలను సొరంగాల్లో గుర్తించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు ఇజ్రాయిలీ మిలటరీ చెప్పింది. ఇదిలా ఉంటే గాజా స్ట్రిప్ మధ్య భాగంలోని మాఘాజీ శరణార్థి శిబిరంపై ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడిలో 70 మంది మరణించారని పాలస్తీనా ఆరోగ్యమంత్రిత్వ శాఖ అధికారి ఆదివారం తెలిపారు. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్‌లో మరో వైమానిక దాడిలో 8 మంది మరణించినట్లు వైద్యులు తెలిపారు. గాజాపై ఆదివారం రాత్రి నుంచి ఇజ్రాయిల్ వైమానిక దాడులు చేస్తోంది. సోమవారం ఉదయం వరకు ఈ దాడులు కొనసాగాయి. సెంట్రల్ గాజాలోని అల్-బురీజ్ పై దాడి చేసింది. ఇజ్రాయిల్ వైమానిక దాడిని భయంకరమైన ఊచకోతగా హమాస్ అభివర్ణించింది. గతంలో గాజా ఉత్తర ప్రాంతాన్ని మాత్రమే టార్గెట్ చేసిన ఇజ్రాయిల్ ప్రస్తుతం, దక్షిణ భాగంతో పాటు వెస్ట్ బ్యాంకులో కూడా దాడులు చేస్తోంది. అక్టోబర్7న హమాస్, ఇజ్రాయిల్‌పై దాడులు చేసి 1200 మందిని ఊచకోత కోసింది. పిల్లలు, పెద్దలు, మహిళలు అని చూడకుండా దొరికిన వాళ్లను దొరికినట్లుగా చంపేసింది. మరో 240 మందిని బందీలుగా చేసుకుంది. అయితే ఇటీవల ఇజ్రాయిల్-హమాస్ సంధి ఒప్పందంలో 105 మంది బందీలను హమాస్ విడుదల చేసింది. ఇందుకు ప్రతిగా ఇజ్రాయిల్ తమ జైళ్లలో ఉన్న 200 మంది పాలస్తీనా ఖైదీలను వదిలేసింది. మరోవైపు ఇజ్రాయిల్ జరుపుతున్న దాడుల్లో 20,400 మంది పాలస్తీనియన్లు మరణించారు.

## మంచో చెడో.. రిటైర్ అయ్యా.. నాకేం సంబంధం లేదు!



మంచో.. చెడో.. రిటైర్ అయ్యాను.. నాకేం సంబంధం లేదు. ఈ నేపథ్యంలో.. తాను రెజ్లింగ్ నుంచి రిటైర్ అయ్యానంటూ బ్రిజ్‌భూషణ్ సింగ్ ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. "నేను 12 ఏళ్ల పాటు సమాఖ్యకు సేవలందించాను. మంచో, చెడో ఏం చేశానో కాలమే సమాధానమిస్తుంది. ఇప్పుడైతే నేను రెజ్లింగ్ నుంచి రిటైర్ అయ్యాను. సమాఖ్యతో సంబంధాల్ని పూర్తిగా తెంచుకున్నాను. వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల (లోక్‌సభ)పైనే దృష్టి పెట్టాను. డబ్ల్యూఎఫ్ఐలో ఏం జరిగినా అది కొత్త కార్యవర్గానికి చెందిన వ్యవహారమే తప్ప నాకు సంబంధించింది కాదు" అంటూ బ్రిజ్‌భూషణ్ ప్రకటన విడుదల చేశారు.



## టీడీపీలో చేరనున్న వైసీపీ ఎమ్మెల్యే?

జగ్గంపేట వైసీపీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు టీడీపీలో చేరనున్నారని వార్తలు వెలువడుతున్నాయి. వచ్చే నెల 5, 6 తేదీలో టీడీపీ కండువా కప్పుకోనున్నారని సమాచారం. ఇప్పటికే ఆయన టీడీపీ పెద్దలతో మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ నుంచి చంటిబాబుకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చే పరిస్థితి లేదని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆయన పార్టీ మారుతున్నారట.




## ఒకే కుటుంబంలో ఐదుగురికి కరోనా

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి కరోనా సోకింది. తొలుత కుటుంబంలోని వృద్ధురాలు కరోనా బారిన పడింది. తర్వాత మిగతా వారికి పరీక్షలు చేయగా.. నలుగురికి కోవిడ్ సోకినట్లు తేలింది. వారిలో ఇద్దరు పిల్లలు ఉన్నారు. వైద్యుల పర్యవేక్షణలో వీరు చికిత్స తీసుకుంటున్నారు. ప్రస్తుతం వీరందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. రాష్ట్రంలో 50 కరోనా యాక్టివ్ కేసుల సంఖ్య 50కి చేరింది.



## నల్లగొండ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఆరుగురు మృతి

నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు చనిపోయారు. పాదచారుడిని బైకిస్టు ఢీకొట్టడంతో అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందారు. టాటా ఏస్ వాహనాన్ని ట్యాంకర్ ఢీకొట్టడంతో నలుగురు చనిపోయారు. ఈ రెండు ప్రమాదాలు నిడమనూరు మండల పరిధిలో జరిగాయి. మండలంలోని వేంపాడు స్టేజి వద్ద రాత్రి 10 గంటల సమయంలో నడుచుకుంటూ వెళ్తున్న రమావత్ కేశవ్ ను బైక్ ఢీ కొట్టింది. దీంతో రమావత్ కేశవ తో పాటు బైకిస్ట్ నాగరాజు ఇద్దరూ అక్కడిక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న కుటుంబ సభ్యులు పెద్దవూర మండలం పల్లేవాని కుంట తండా, పుల్యా తండాకు ఏడుగురు టాటా ఏస్ వాహనంలో ప్రమాదస్థలికి బయలుదేరారు. నిడమనూరు మండలం శాఖాపురం సమీపంలోటాటా ఏస్ వాహనాన్ని ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదాల సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయచర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించారు.

**ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి..**

రెండు ప్రమాదాల్లో మల్లేవని కుంట తండాకు రమవత్ సేవలు (19),రమావత్ గణ్య(40), రమావత్ నాగరాజు, పుల్య తండాకు చెందిన రమావత్ పాండు (42), రమావత్ బుజ్జి (38), వెంపాడుకు చెందిన బురుసు సైదులు (60) పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ మరణాలతో పుల్య తండాలో విషాదం అలుముకుంది. పేదరికంలో ఉన్న మృతుల కుటుంబాలను ఆదుకోవాలని బంధువులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## బిగ్ బాస్ దాడి ఘటనలో మరో ముగ్గురు అరెస్ట్.!

బిగ్ బాస్ షోకు సంబంధించి విచారణ ఇంకా కొనసాగుతోంది. ఈ షో సీజన్ 7 ముగిసిన అనంతరం జరిగిన దాడి ఘటనపై విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ కేసులో మరో ముగ్గురిని అరెస్ట్ చేశారు పోలీసులు. ఇందులో సరూర్ నగర్‌కు చెందిన అవినాష్ రెడ్డి, యూసఫ్ గూడాకు చెందిన సుధాకర్, పవన్‌లను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి నాంపల్లి కోర్టు ముందు హాజరుపరిచారు. ఇక ఈ కేసులో ఇప్పటివరకు 24 మందిని నిందితులుగా జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు.

## 29న మేడిగడ్డకు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు



మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు మేడిగడ్డ బ్యారేజీని సందర్శించనున్నారు. ఈ నెల 29న హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరనున్న మంత్రులు.. మేడిగడ్డ బ్యారేజీ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ప్రాణహిత, కాళేశ్వరం ప్రాజెక్టులను గురించి వివరిస్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల జరిగిన లాభ, నష్టాలు, ప్రాజెక్టు వ్యయం, కొత్త ఆయకట్టు, స్థిరీకరణ ఆయకట్టు, ప్రాజెక్టు నిర్వహణకు అవసరమైన విద్యుత్, మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల సమస్యలు, వాటి పరిష్కారాలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహిస్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అనంతరం మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను సందర్శిస్తారు. పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని ఈఎన్‌సీ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ప్రాజెక్టు నిర్మాణ సంస్థలు, సబ్ కాంట్రాక్టర్ల, నిర్మాణంతో సంబంధమున్న అందరికి సమాచారం అందించాలని, పాల్గొనేలా చూడాలని స్పష్టం చేశారు.

## 'లీకులు' చేస్తున్నదెవరు..? వారిపై రేవంత్ సర్కార్ నిఘా..



తెలంగాణలో ప్రభుత్వ నిర్ణయాలు ముందే లీకవుతున్నాయా? అసెంబ్లీలో ప్రభుత్వం ఏం చెప్పబోతోంది..? అంతర్గత సమీక్షల్లో ఏం జరుగుతోంది..? ఎలాంటి నిర్ణయాలు తీసుకోబోతున్నారు? అనే విషయాలు ప్రతిపక్షాలకు ముందే చేరుతున్నాయా? అంటే అవుననే అనుమానిస్తోంది ప్రభుత్వం. అందుకే నష్టనివారణ చర్యలు చేపట్టాలని డిసైడ్ అయింది.. ఆస్తులు.. అప్పులు.. గత ప్రభుత్వ నిర్ణయాలపై ఆరోపణలు, ప్రత్యారోపణలతో ఆసక్తిగా మారింది తెలంగాణ రాజకీయం. అయితే ఈ క్రమంలో కొంతమంది అధికారుల నుండి లీకవుతున్న సమాచారం.. విపక్షాలకు ఆయుధంగా మారుతోంది. అదే సమయంలో ప్రభుత్వాన్ని కూడా ఇబ్బంది పెడుతోంది. శ్వేతపత్రాలను అసెంబ్లీలో ప్రవేశపెట్టకముందే.. వాటికి విపక్ష సభ్యులు అంశాలవారీగా కౌంటర్ సిద్ధం చేయడంతో ప్రభుత్వం ఈ అనుమానానికి వచ్చినట్టు తెలుస్తోంది. అలాగే శ్వేతపత్రాలను ఎవరితో చేయించారు అన్న సమాచారం కూడా ప్రతిపక్షాలకు చేరడం ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టింది. లీకైన సమాచారం ఆధారంగానే ప్రభుత్వ శ్వేతపత్రానికి..ప్రతిపక్ష సభ్యులు కౌంటర్ సిద్ధం చేసినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. దీంతో ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన.. ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. నివేదికలు, సమీక్షల్లో అంతర్గతంగా చర్చించిన అంశాలు బయటకు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హెచ్చరించినట్టు తెలుస్తోంది. అదే అంశాన్ని అన్ని ప్రభుత్వ శాఖల హెచ్‌వోడీలకు స్పష్టం చేసినట్లు సమాచారం. గత ప్రభుత్వంతో సన్నిహితంగా పనిచేసిన సిబ్బందిపై కూడా నిఘా పెట్టాలని ఆదేశాలు జారీ చేశారని తెలుస్తోంది.




## పేటీఎం ఉద్యోగులకు భారీ షాక్!

ఫిన్‌టెక్ సంస్థ పేటీఎం ఉద్యోగులకు భారీ షాకిచ్చింది. సుమారు వెయ్యి మంది ఉద్యోగుల్ని తొలగించినట్లు ప్రకటించింది. కాస్ట్ కటింగ్‌లో భాగంగా దేశంలో పలు ప్రాంతాల నుంచి పని చేస్తున్న ఉద్యోగుల్లో పలువురిని పేటీఎం తొలగించినట్లు సమాచారం. ఈ మొత్తం సంఖ్య 10 శాతం కంటే ఎక్కువగా ఉంది. అయితే గత రెండు మూడేళ్ల క్రితం పేటీఎం ఉద్యోగుల్ని భారీ ఎత్తున నియమించుకుంది. ఇప్పుడు ఉద్వాసన పలికిన ఉద్యోగుల్లో వీళ్లే ఎక్కువ మంది ఉన్నారు. ఈ తరుణంలో ఉద్యోగుల తొలగింపుపై ఆ సంస్థ ప్రతినిధులు స్పందించారు. ఖర్చుల్ని తగ్గించుకునే ప్రణాళికల్లో భాగంగా సిబ్బందిని తొలగించినట్లు తెలిపారు. ఉద్యోగుల తొలగింపుతో ఖాళీ అయిన విభాగాల్లో ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీతో భర్తీ చేసినట్లు వెల్లడించారు. ఇక వచ్చే ఏడాది పేటీఎం మరో 15వేల మంది ఉద్యోగుల్ని నియమించుకోనుంది.

## ప్రసవ వేదన.. అడవిలో 5 కి.మీ నడిచిన గర్భిణి



ప్రసవ వేదనను భరిస్తూ చికిత్స కోసం ఓ గర్భిణి కటిక చీకట్లో సుమారు 5 కి.మీ. నడిచిన ఘటన ఇది. అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం గబ్బిలాలగొందికి చెందిన కోండ్ల సీతకు శనివారం రాత్రి నొప్పులు వచ్చాయి. సెల్‌ఫోన్ లైట్ వెలుగులో 5 గంటలపాటు రాళ్లు, గుట్టల మధ్య ఆమె భర్తతో కలిసి నడిచింది. ముల్లూరు ప్రధాన రహదారిపై అటుగా వస్తున్న ఆటో ఆగడంతో సీతను ఎక్కించి కూటూరు ఆస్పత్రికి తరలించారు. తరవాత ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది.



## వికారాబాద్ జిల్లాలో చెరువులోకి దూసుకెళ్లి కారు

కారు అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లిన ఘటన జిల్లాలోని శివారెడ్డిపేటలో చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. అనంతగిరికి వచ్చిన పర్యాటకులు తిరుగు ప్రయాణంలో హైదరాబాద్‌కు వెళ్తుండగా సోమవారం ఉదయం మంచు కురుస్తున్న కారణంగా ముందు ఉన్న రోడ్డు సరిగా కనిపించక కారు అదుపు తప్పి శివరెడ్డిపేట చెరువులోకి దూసుకెళ్లినట్టు సమాచారం. చెరువులోకి దూసుకెళ్లిన కారులో ఉన్న ముగ్గురు సురక్షితంగా బయటపడగా మరో ఇద్దరి కోసం పోలీసులు, రెవెన్యూ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మాళవికా మోహనన్ గ్లామర్ షో

'మాస్టర్' హీరోయిన్ మాళవికా మోహనన్ నెట్టింట మరోసారి అందాల మంట పెట్టేసింది. నెవర్ బిఫోర్ లుక్ లో కనిపించి కుర్రాళ్ల ఫ్యూజులు అవుట్ అయ్యేలా చేసింది. లేటేస్ట్ స్టిల్స్ నెట్టింట వైరల్ గా మారాయి. మలయాళీ ముద్దుగుమ్మ, యంగ్ హీరోయిన్ మాళవికా మోహనన్ తమిళ చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యంగా ఈ బ్యూటీ స్టార్ హీరో విజయ్ దళపతి సరసన 'మాస్టర్' మూవీలో నటించి బాగా పాపులర్ అయ్యింది. ఇటు తెలుగు ఆడియెన్స్ కూడా దగ్గరైంది. వరుసగా సినిమాలు చేస్తూనే వస్తున్న మాళవికా ఇటు సోషల్ మీడియాలోనూ చాలా యాక్టివ్ గా కనిపిస్తున్నారు. ఎప్పటికప్పుడు తన గురించి అప్డేట్స్ అందిస్తూనే ఉన్నారు. మరో గ్లామర్ ఫొటోషూట్లతో మతులు పోగొడుతోంది. తాజాగా మాత్రం డేరింగ్ గా ఫొటోషూట్ చేసింది. తాజాగా మాళవికా మోహనన్ పంచుకున్న ఫొటోలకు అభిమానులతో పాటు నెటిజన్లు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఊహించని విధంగా మలయాళీ ముద్దుగుమ్మ ఫొటోలకు ఫోజులిచ్చింది. అందాల పదునుతో కుర్ర హృదయాలను ముక్కలుగా కోసేసింది.లేటెస్ట్ లుక్ లో మాళవికా మోహనన్ స్టన్నింగ్ గా మెరిసింది. ఎర్రటి చాలీ చాలనీ దుస్తుల్లో మంటలు పుట్టించింది.వొళ్లంతా కనిపించేలా అందాల ప్రదర్శన చేసింది. టాప్ గ్లామర్ షోతో పాటు నడుము, నాభీ సొగసుతో నిద్రలు కరువు చేసింది. ఇంత డేరింగ్ గా మాళవికా ఫొటోషూట్ చేయడం ఇదే మొదటి సారీ. చూడటానికి సెమీ న్యూడ్ గా కనిపించే ఫొటోలను కూడా షేర్ చేయడం ఇప్పుడే. మొత్తానికి మాళవికా తాజా లుక్ కు నెటిజన్లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రకరకాల కామెంట్లతో ఫొటోలను వైరల్ చేస్తున్నారు.



# ఆరు గ్యారంటీలపై గ్రామసభల్లో దరఖాస్తుల స్వీకరణ



పరిపాలనను ప్రజల గుమ్మం వద్దకే తీసుకువెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 'ప్రజాపాలన' పేరుతో ప్రజల్లోకి వెళ్లనుంది. ఈ నెల 28న ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. ఇది జనవరి 6వ తేదీ వరకు కొనసాగుతుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సచివాలయంలో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తుల్ని ప్రజాపాలన పేరుతో నిర్వహించే గ్రామసభల్లో స్వీకరిస్తారు.సదస్సు వివరాల్ని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకరులకు వెల్లడించారు. ఆరు గ్యారంటీలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతాయన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా పథకాల్లో కోత పెట్టబోమన్నారు. ఆరు గ్యారంటీలకు లబ్ధిదారులుగా రేషన్‌కార్డు ఉన్నవారు అర్హులవుతారని చెప్పారు.

దరఖాస్తులు ఒకట్రెండు రోజుల ముందే ఇస్తాం

"ప్రతి పట్టణం, గ్రామం, తండాలో ప్రజాపాలన నిర్వహిస్తాం. అధికారులు ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక గ్రామంలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మరో గ్రామంలో సభలు నిర్వహిస్తారు. ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తుల్ని ఈ గ్రామసభల్లో స్వీకరించి రసీదు ఇస్తారు. దరఖాస్తుల్ని నింపడానికి ఇబ్బంది లేకుండా 28వ తేదీకి ఒకట్రెండు రోజుల ముందే ప్రజలకు ఫాంలను అందిస్తాం. ఎవరైనా దరఖాస్తు చేయకపోయినా ఆందోళన చెందొద్దు. అధికారులను ప్రజల గుమ్మం వద్దకు పంపించి.. వారి అర్హతను బట్టి పథకాలను వర్తింపజేస్తాం. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తయ్యాక ఏ పథకానికి ఎవరు అర్హులో అధికారులు నిర్ణయిస్తారు. గత ప్రభుత్వం మాదిరిగా కలెక్టర్ల సమావేశం ఏకపక్షంగా జరగలేదు. కలెక్టర్లు, ఎస్పీల అభిప్రాయాల్ని అడిగి తెలుసుకున్నాం. ఆరు గ్యారంటీల్లో రెండింటిని ఇప్పటికే అమలు చేశాం. ఆర్టీసీ బస్సుల్లో గతంలో 30-32 శాతం మహిళా ప్రయాణికులు ఉంటే.. ఇప్పుడు ఆ సంఖ్య 58-61 శాతానికి పెరిగిందని కలెక్టర్లు చెప్పారు. అమలు చేసిన పథకాలకు సంబంధించి వస్తున్న ఫీడ్‌బ్యాక్ మా ప్రభుత్వానికి చాలా సంతోషం కలిగిస్తోంది.

వేల ఎకరాల భూముల కబ్జా

ఆరు గ్యారంటీలతో పాటు ధరణిపై సదస్సులో చర్చించాం. ఆ పోర్టల్ ప్రక్షాళనపై కసరత్తు మొదలైంది. ధరణి ద్వారా గత ప్రభుత్వ పెద్దలు వేల ఎకరాల భూముల్ని ఆక్రమించుకుని క్రమబద్ధీకరించుకున్నారు. మరికొన్ని క్రమబద్ధీకరణ ప్రక్రియలో ఉన్నాయి. నాటి ప్రభుత్వం ప్రభుత్వ ఆస్తుల్ని దోచుకుంది. వాటిని తిరిగి రాబడతాం. ఎన్నికల సమయంలో అప్పటి సీఎం ధరణిపై ప్రజల్ని రెచ్చగొట్టేలా మాట్లాడారు. కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో వేయాలన్నారు. కానీ, ఆ పార్టీ (భారాస)నే ప్రజలు బంగాళాఖాతంలో వేశారు. భూముల అక్రమాలపై స్పష్టమైన ఆధారాలతో త్వరలోనే ముందుకొస్తాం. తప్పు చేసినవారు ఎంతటి పెద్దవారైనా వదిలిపెట్టేది లేదు. అలాగని ఏ అధికారినీ, నాయకుడినీ కక్షసాధింపుతో ఇబ్బంది పెట్టం" అని పొంగులేటి చెప్పారు. అన్ని ఆధారాలతో ఒక రోజు పూర్తిగా ధరణిపైనే మాట్లాడతానన్నారు. ఆ పోర్టల్‌తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. అది చెడ్డదేనని విలేకరుల ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

సచివాలయం, సీఎం నివాసం కట్టడమే అభివృద్ధా?

భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌పై విలేకరులు అడిగిన ప్రశ్నలకు పొంగులేటి స్పందించారు. ధనిక రాష్ట్రాన్ని నాటి భారాస ప్రభుత్వం రూ.6.71 లక్షల కోట్ల అప్పులపాలు చేసిందన్నారు. అన్ని అప్పులున్న విషయాన్ని కేటీఆర్ ఒప్పుకొన్నారని చెప్పారు. 'చేసిన అప్పులకు ఆస్తులు సంపాదించామని కేటీఆర్ అంటున్నారు. బాగా ఉన్న సచివాలయాన్ని కూల్చి ప్యాలెస్ లాంటి సచివాలయం కట్టాల్సిన అవసరం ఏమొచ్చింది? నాలుగు భవనాలు కట్టడం అభివృద్ధా? గతంలో కట్టిన సీఎం నివాస భవనం ఉన్నా.. మళ్లీ కొత్తది కట్టారు. అదేనా అభివృద్ధి, సంపద సృష్టి?' అని ఆయన ప్రశ్నించారు.



# ఎలుక కొరకడంతో 40 రోజుల పసికందు మృతి

నాగర్ కర్నూల్ జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. నాగనూల్ గ్రామంలో 40రోజుల చిన్నారి ముక్కును ఎలుక కొరకడంతో మృతి చెందాడు. హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రిలో చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. తీవ్ర రక్తస్రావంతో చిన్నారి కన్నుమూశాడు. దీంతో నాగనూల్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నాగనూల్ గ్రామానికి చెందిన లక్ష్మీకళ, పెద్ద కార్పాముల గ్రామానికి చెందిన శివకు మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. 40రోజుల క్రితం వీరికి శిశువు జన్మించాడు. అప్పటి నుంచి లక్ష్మీకళ అమ్మగారి ఇంటి వద్దే ఉంటోంది. అయితే రెండు రోజుల క్రితం శిశువు నిద్రిస్తున్న క్రమంలో ఎలుక శిశువు ముక్కు కొరికింది. అయితే ఎలుక పదేపదే శిశువు ముక్కు కొరకడంతో తీవ్రరక్తస్రావం అయ్యింది. గమనించిన తల్లి, కుటుంబసభ్యులు స్థానిక నాగర్ కర్నూల్ జిల్లా అస్పత్రికి తరలించారు. అయితే శిశువు పరిస్థితిని గమనించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ కు తరలించాలని చెప్పారు. దీంతో శిశువును నిలోఫర్ అస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ నిన్న రాత్రి శిశువు మరణించాడు.




# భద్రాద్రికి పోటెత్తిన భక్తులు

వరుస సెలవులు రావడంతో భద్రాచలం రామాలయానికి భక్తులు పోటెత్తారు. అన్ని క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసి పోయాయి. ప్రసాద కౌంటర్లలోనూ రద్దీ నెలకొంది. నిత్య కల్యాణానికి దంపతులు భారీగా తరలివచ్చారు. భద్రాద్రి రామయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానాలయంలో మూలవిరాట్ ముత్తంగి (ముత్యాల వస్త్రాలు ధరించిన) రూపంలో దర్శనమిచ్చారు.

# నైజీరియాలో ఆత్మాహుతి దాడి.. 16 మంది మృతి

## నేరస్తులకు శిక్ష తప్పదన్న గవర్నర్

ఉత్తర మధ్య నైజీరియాలో ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ దాడిలో 16 మంది మరణించారు. ఈ ఘటనపై పశువుల కాపరులు, రైతుల మధ్య ఘర్షణలు ఇక్కడ సర్వసాధారణమని ఆర్మీ ఆదివారం తెలిపింది. పీఠభూమి రాష్ట్రంలోని ముషు గ్రామంలో శనివారం అర్ధరాత్రి దాడి జరిగిందని కెప్టెన్ ఓయా జేమ్స్ AFPకి తెలిపారు. నైజీరియాలో ఉత్తర.. దక్షిణ నైజీరియా దేశాల మధ్య విభజన రేఖ ఉంది.. ఉత్తర నైజీరియాలో ముస్లింలు ఎక్కువగా ఉండగా.. దక్షిణ ప్రాంతాల మధ్య క్రైస్తవులున్నారు. దీంతో ఈ ప్రాంతం అనేక సంవత్సరాలుగా జాతి, మతపరమైన ఉద్రిక్తతలతో పోరాడుతోంది. అయితే ఈ దాడికి కారణమేమిటో, బాధ్యులెవరో తెలియరాలేదు. ఎలాంటి ఘర్షణలు జరగకుండా భద్రతా సిబ్బందిని మోహరించారు. ఈ ప్రాంతం పశువుల కాపరులు (ముస్లింలు), రైతులు (క్రైస్తవులు) మధ్య తరచుగా ఘర్షలు జరుగుతూనే ఉంటాయి. ఈ ప్రదేశంలో హత్యలు జరగడం సర్వాధారణంగా గుర్తించబడింది. తరచుగా



భారీగా సాయుధ ముఠాలు గ్రామాలపై దాడి చేస్తాయి.

**దాడిని ఖండించిన గవర్నర్**

ఈ దాడిని రాష్ట్ర గవర్నర్ కాలేబ్ ముతాఫ్వాంగ్ ఖండించారు. ఇది అనాగరికం, క్రూరమైన చర్యగా అభివర్ణించారు. బాధితులకు న్యాయం చేస్తామని.. నేరస్తులకు శిక్ష తప్పదని చెప్పారు. అమాయక పౌరులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ ప్రతినిధి గ్యాంగ్ బెరే విలేకరులతో అన్నారు.

నూతన సంవత్సర ఈవెంట్లకు

# అనుమతి తప్పనిసరి

## సీపీ అవినాశ్ మహంతి



నూతన సంవత్సరం సందర్భంగా నిర్వహించే ఈవెంట్లకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాల్సిందేనని సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి అన్నారు. పర్మిషన్ తీసుకున్న తర్వాతే టికెట్లు విక్రయించాలని స్పష్టం చేశారు. మాదాపూర్‌లోని హైటెక్‌సిటీ సమీపంలో నిర్వహించ తలపెట్టిన 'సన్‌బర్న్' ఈవెంట్‌పై తలెత్తిన వివాదంపై సీపీ స్పందించారు. ఈవెంట్ నిర్వాహకులు దరఖాస్తు చేసుకున్నప్పటికీ తాము అనుమతి ఇవ్వలేదని చెప్పారు. ఇది ఇతర నగరాల్లో జరిగే సన్‌బర్న్‌లాంటి వేడుక కాదని, అందుకే పర్మిషన్ నిరాకరించామని తెలిపారు.కాగా, ఈవెంట్‌కు అనుమతి ఇవ్వకపోయినప్పటికీ నిర్వాహకులు ఆన్‌లైన్‌లో టికెట్లు విక్రయిస్తున్నారు. దీనిపై బుక్‌మై షో ప్రతినిధులకు వార్నింగ్ ఇచ్చినట్లు తెలుస్తున్నది. పరిధి దాటితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు సమాచారం.

పొగమంచు ప్రభావం..

# విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం

దేశ రాజధాని ఢిల్లీ సహా పలు రాష్ట్రాలను పొగమంచు కమ్మేసింది. ఢిల్లీలో ఉష్ణోగ్రత 9.4 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. ఈ కారణంగా రహదారిపై ప్రయాణాలు అత్యంత కష్టంగా మారాయి. మరోవైపు పాలం విమానాశ్రయంలో ఎదురుగా కొద్ది మీటర్ల దూరంలో ఉన్న వస్తువులు కూడా కనిపించనంత దట్టంగా పొగ మంచు కమ్ముకుంది. దీంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారత వాతావరణ శాఖ నివేదిక ప్రకారం ఇక్కడ రన్‌వేపై విజిబిలిటీ దారుణంగా పడిపోయింది. దీంతో అత్యవసరంగా టేకాఫ్ కావాల్సిన విమానాల విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. పలు జాతీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇప్పటికే ఈ విమానాశ్రయానికి వస్తున్న పలు విమానాలను దారి మళ్లించారు. ప్రయాణికులు ఫ్లైట్ స్టేటస్‌ను తరచూ చెక్ చేసుకోవాలని స్పైస్ జెట్ కోరింది. పొగమంచు వల్ల తమ సేవలపై ప్రభావం పడుతోందని వెల్లడించింది.





# విజృంభిస్తోన్న కరోనా..

# దేశంలో 4 వేలకు చేరిన కరోనా కేసులు

కరోనా మహమ్మారి రోజురోజుకు చాపకింద నీరులా విస్తరిస్తోంది. దేశ వ్యాప్తంగా పాజిటివ్ కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. గడిచిన 24 గంటల్లో దేశంలో కొత్తగా 312 కొవిడ్ కేసులు నమోదయ్యాయి. దీంతో దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 4 ,054కు చేరిందని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. అత్యధికంగా కేరళలో 128 కేసులు నమోదయ్యాయి. దేశంలో కరోనా బారిన పడిన వారి మొత్తం సంఖ్య 4.5 కోట్లుగా నమోదైంది. వైరస్ బారిన పడ్డ వారిలో 4,44,71,860 కోట్ల మంది కోలుకున్నారు. వైరస్ బారిన పడి కోలుకున్న వారి శాతం 98.81 గా నమోదైంది. భారత్ తో పాటుగా అనేక దేశాల్లో కరోనా కేసులు మళ్లీ పెరుగుతుండటంతో డబ్ల్యూహెచ్ఓ ఆందోళన చెందుతోంది. కరోనా ప్రోటోకాల్‌ను అనుసరించాలని పలు దేశాలకు సూచించింది. ఇప్పటికే సింగపూర్‌లో మాస్కులు తప్పనిసరి చేశారు.